www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 19 | సెప్టెంబర్ | 2026
పేజీలు : 8

# ఏసిబికి చిక్కిన హాస్టల్ వార్డెన్

**ఉద్యోగికి వేతనం ఇచ్చేందుకు లంచం డిమాండ్**




**ప్రజాపక్షం/చర్ల :** హాస్టల్ కుక్ జీతం బిల్లు చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసిన ఐటిడిఏ గిరిజన బాలుర వసతి గృహం సత్యనారాయణపురం హాస్టల్ వార్డెన్ భూక్యా వాలు సింహాను ఏసిబి అధికారులు శుక్రవారం రెండ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసిబి డిఎస్‌పి వై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం హాస్టల్ కుక్ జీతం బిల్లు చెల్లించే విషయంలో వార్డెన్ రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడని ఆఖరికి రూ.14వేలు బేరం కుదుర్చుకుని తీసుకుంటుండగా వార్డెన్‌ను రెడ్ హ్యాండెడ్‌గాపట్టుకున్నట్లు చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సైతం అవినీతి నిరోదకశాఖపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వాధికారులు సిబ్బంది ఎవరైనా లంచం డిమాండ్ చేసినా అవినీతికి పాల్పడినా ప్రజలు ధైర్యంగా ఏసిబిని సంప్రదించాలని సూచించారు. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెం.1064ను సంప్రదించాలని తెలిపారు. నేరుగా ఏసిబి డిఎస్‌పిని సంప్రదించేందుకు 9154388981 నెంబర్‌కు కాల్ చే యాలని అన్నారు. హాస్టల్ వార్డెన్‌పై కేసు న మోదుచేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

## చావడం.. చంపడమే

# పరిష్కారమా..!





**-పెరుగుతున్న హత్యలు.. ఆత్మహత్యలు**

**-ప్రత్యామ్నాయ ఆలోచన రానివ్వని మానసిక ఒత్తిడి**





**ప్రజాపక్షం/ ఖమ్మం :**

చర్చించి సమస్యను పరిష్కరించుకుందాం అన్న ఆలోచన మన సంస్కృతిలోనే ఉంది. తెలంగాణలో కూర్చుని మాట్లాడుకుందాం అన్న నానుడి తెలియంది కాదు. కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం కాని సమస్య లేదన్నది చరిత్ర మనకు చెబుతున్న సత్యం. కానీ ఇప్పుడు చావడమో చంపడమో తప్ప మరో పరిష్కారం లేదన్న రీతిలో కొందరు వ్యవహరిస్తున్నారు. వరుస ఆత్మహత్యలు, హత్యలు చూస్తుంటే ప్రత్యామ్నాయ ఆలోచన చేయలేక ఈ మార్గాన్ని ఎంచుకుంటున్నారన్న భావన కలుగుతుంది. గతంలో హత్య లేదా ఆత్మహత్య అన్న ఆలోచన

మిగతా 2లో..



# ఆర్టిసిలో మోగిన ఎన్నికల నగారా




**-అక్టోబర్ తొమ్మిదిన ఎన్నికలు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసిలో గుర్తింపు సంఘం ఎన్నికల కోసం నగారా మోగింది. కార్మిక శాఖ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 21 నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. అక్టోబర్ తొమ్మిదిన గుర్తింపు ఎన్నికల కోసం పోలింగ్ నిర్వహిస్తారు. ఉదయం ఐదు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుంది.
అక్టోబర్ 14, 15 తేదీలలో

మిగతా 2లో..

# ప్రాణం తీసిన నిర్లక్ష్యం

**-బ్యాంకు ఖాతాలు నిలిపివేయడంతో మందులు లేక దళిత మహిళ మృతి**



**ప్రజాపక్షం/చింతకాని :**
ఆమెకు ప్రభుత్వం ఇస్తున్న పింఛనే ఆధారం. అది తప్ప మరో ఆధారం లేదు. భర్త ఎప్పుడో మరణించాడు. ఉన్న కొడుకు ఆమెను వదిలి ఎటో వెళ్లాడు. ఆమెకు ప్రతి నెల ప్రభుత్వం ద్వారా చేయూత పింఛన్ ఆధారం.
దానిని

మిగతా 2లో..

# పెద్దలను వదిలి పేదలకు నోటీసులా..?



**-శ్రీనివాస్ నగర్‌లో పేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి**

**-కాలుష్య కారక టింబర్ మిల్లులను తరలించాలి**

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

2 లో

# యువత క్రీడలపై దృష్టి సారించాలి




**-సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్‌కే. సాబీర్ పాషా**

**- ఘనంగా ప్రారంభమైన ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్**

7 లో

# చావడం.. చంపడమే పరిష్కారమా..!

**(మొదటిపేజీ తరువాయి)** రాగానే తదనంతర పరిణామాలను ఆలోచించడంతో పాటు స్నేహితులు, బంధువులతో తమ సమస్యలను చెప్పి చర్చించే వారు. కుటుంబ పరిస్థితులను పరిగణలోకి తీసుకునే వారు. అప్పట్లో పిల్లల పట్ల ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉండేది. ఇటీవల కాలంలో తమతో పాటే పిల్లలను కూడా అంతం చేయాలన్న ఆలోచన రాను రాను పెరుగుతుంది. ఇటీవల జరిగిన వరుస సంఘటనలను చూస్తుంటే పిల్లలను హతమార్చి భార్యా భర్తలు ఆత్మహత్య చేసుకోవడం లేదా భర్తతో ఘర్షణ వచ్చినప్పుడు పిల్లలను హతమార్చి భార్య చనిపోవడం అదే రీతిలో భర్త వ్యవహరించడం జరుగుతుంది. రెండు రోజుల క్రితం ఇద్దరు పిల్లలకు కూల్‌డ్రింక్‌లో విషం కలిపి తాను తాగి పిల్లలకు తాగించాడు ఓ తండ్రి. కుమార్తె మరణించగా కుమారుడు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇది కేవలం ఒక ఉదాహరణ మాత్రమే. చిన్న సమస్య తలెత్తిందంటే చాలు చనిపోదామన్న ఆలోచన చేస్తున్నారు. మానసికంగా ధృడంగా ఉండలేకపోతున్నారు. సమస్య ఉత్పన్నమైనప్పుడు ఇతరులతో చర్చించి సమస్యను పరిష్కరించుకుందాం అన్న ఆలోచన చేయకుండానే చిన్న చిన్న విషయాలకే ప్రాణాలను తీసుకుంటున్నారు. కొందరు ఆత్మహత్య చేసుకున్న కారణాలను అన్వేషిస్తే ఈ చిన్న కారణానికే చనిపోవాలా అన్న భావన కలుగుతుంది. హత్యల విషయానికి వస్తే బద్ధ శత్రువునైనా హతమార్చేందుకు పలు రకాల ఆలోచనలు చేసేవారు. ప్రాణాలు తీయడం నేరం, పాపం అన్న భావన ఉండేది. ఇప్పుడు చిన్న తేడా వస్తే చాలు ప్రాణాలు తీసేస్తున్నారు. ఈ ప్రాణాలు తీసే విషయంలోనూ రక్త సంబంధాలు , స్నేహాలు, బంధుత్వాలు ఏవి గుర్తుకు రావడం లేదు. కుమారులు, కుమార్తెలే కన్న వారిని హతమార్చడం, రక్త సంబంధికులను చంపడం, అన్నింటికి మించి అనేక ఏళ్ల కాపురం తర్వాత భార్య భర్తల మధ్య విబేధాలు రాగానే ఎదుటి వారిని లేకుండా చేయాలన్న ఆలోచనలు రావడం చిన్న చిన్న ఆర్థిక ఒప్పందాలతో ప్రాణ స్నేహితులను సైతం హతమార్చడం క్రమేపి పెరుగుతూ వస్తుంది. భార్య భర్తల మధ్య జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో ఆర్థిక విషయాల కంటే అక్రమ సంబంధాలే ఎక్కువగా కారణమవుతున్నాయి. నేను ఏమైపోయినా బాధలేదు. కానీ నా వాళ్ల బాగుండాలన్న భావన చచ్చిపోయి నేను బాగుంటే చాలు వాళ్ల ఏమైపోయినా బాధలేదన్న భావన ప్రబలుతుంది. ఇటీవల కాలంలో పెరిగిన నిరుద్యోగం వట్టిపోయిన ఉపాధి నడుమ మత్తుకు బానిసలు అయ్యే వారి సంఖ్య పెరిగిపోయింది. ఈ మత్తులో చిన్న చిన్న అవసరాలను తీర్చుకునేందుకు హింసాత్మక చర్యలను గంజాయి లాంటి మాదక ద్రవ్యాల రవాణాను వృత్తిగా ఎంచుకుంటున్నారు. దీనిని ఆసరాగా తీసుకుని ప్రత్యర్థులను అడ్డు తొలగించుకునేందుకు మత్తుకు బానిసలైన వారిని వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు ఒక హత్య జరిగితే చర్చోపచర్చలు సాగేవి. కథలు కథలుగా చెప్పుకునే వారు. కానీ ఇప్పుడు రోజు ఏదో ఒక మూల ఎక్కడో ఒక చోట హత్యలు జరుగుతూనే ఉన్నాయి. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగి సిసి కెమెరాలు అందుబాటులో రావడం, సోషల్ మీడియా పుణ్యమా అని హత్యా ఘటనలను సైతం ఇంట్లో కూర్చుని చూసే అవకాశం కలుగుతుంది. హత్యలు, ఆత్మహత్యలు లేదా హింసాత్మక చర్యలకు పాల్పడటం ఒక మానసిక బలహీనత లేదా ఇందుకు మన చుట్టూ ఉన్న పరిస్థితులు కారణమవుతున్నాయి. టివి, ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత మనుషుల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయి. కృత్రిమ జీవితానికి అలవాటు పడటం సంఘ జీవనానికి దూరంగా మసులుకోవడం కూడా ఈ రకమైన ఆలోచనలు రావడానికి కారణమవుతుంది. ఆహారపు అలవాట్లు మారడంతో పాటు సామాజిక, ఆర్థిక పరిస్థితులు మారుతున్న ఆలోచనలు చంపడం, చావడం అన్న దానిని ప్రేరేపిస్తున్నాయి. వర్తమానంతో పోల్చినప్పుడు గతమే నయం అన్న భావన కలుగుతుంది. మానవ సంబంధాలు మెరుగుపడటం, మానసిక ధృడత్వాన్ని పెంపొందించుకోవడం సమస్యను పరిష్కరించుకోవడానికి పలు మార్గాలు ఉన్నాయన్న భావన పెరిగితేనే ఈ చావడం, చంపడం తగ్గుతుంది. ఈ దిశగా సామాజిక, స్వచ్ఛంద సంస్థల ద్వారా వివిధ రూపాల్లో విస్తృత ప్రచారం జరగాల్సి ఉంది.

# పెద్దలను వదిలి పేదలకు నోటీసులా..?

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన పెద్దలను వదిలి పేదలకు నోటీసులు ఇవ్వడం ఏమిటని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ప్రశ్నించారు. ఎన్నెస్పి కాలువలను ఆక్రమించుకున్న అధికార పార్టీ నాయకుల వైపు కనీసం కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం పేదలను మాత్రం అక్కడి నుంచి తరలించేందుకు ప్రయత్నిస్తుందని ఆయన ఆరోపించారు. శ్రీనివాస్ నగర్ పేదల ఇండ్లకు తొలగింపు నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ శుక్రవారం సిపిఐ నాయకులు శ్రీనివాస్ నగర్‌లో పర్యటించారు. పేదల ఇండ్లకు వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నారు.ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ 50 ఏళ్లుగా ఈ ప్రాంతంలో పేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని గత ప్రభుత్వం జీవో నెం.58 క్రింద క్రమబద్ధీకరించిందని ఆయన తెలిపారు. కోట్లకు పడగలెత్తిన టింబర్ డిపో యజమానులకు అనుకూలంగా అధికారులు నోటీసులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు ఉన్నత న్యాయస్థానాలకు వెళ్లి న్యాయ పోరాటం చేస్తారా అని సురేష్ అధికారులను ప్రశ్నించారు. పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పేదల ఇండ్లను తొలగించేందుకు ప్రయత్నిస్తుందని అదే పెద్దలు అక్రమించుకుంటే అధికారులు నివేదికలు ఇచ్చినా, న్యాయస్థానాలు తీర్పునిచ్చినా ఆ వైపు కన్నెత్తి చూడరని ఆయన తెలిపారు. రోటరీ నగర్ ప్రాంతంలో అధికార



పార్టీ నాయకులు లక్షలాది రూపాయల విలువైన స్థలాలను అక్రమిస్తే ఈ అధికారులు ఎందుకు స్పందించ లేదని పేదలకు ఒక న్యాయం పెద్దలకు మరో న్యాయమని ఆయన నిలదీశారు. పేదల ఇండ్లను తొలగిస్తే సహించబోమని ఆయన హెచ్చరించారు. త్రీటౌన్ ప్రాంతానికి కాలుష్యాన్ని కలిగిస్తున్న టింబర్ డిపోలను జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని దీనిపై అధికారులు తక్షణం స్పందించాలని సురేష్ డిమాండ్ చేశారు. టింబర్ డిపోలను తొలగించకపోతే ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, నాయకులు సైదా, కుమార్ పాల్గొన్నారు.

# డిజిటల్ ఒత్తిడిలో పంచాయతీ కార్యదర్శులు..!

## రాత్రి పగలు యాప్‌ల ముందు
## కన్నీరు పెడుతున్న పంచాయతీ కార్యదర్శులు

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలలో ఉన్న పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహణలో భాగంగా పంచాయితీ సమాచారాన్ని యాప్ లలో అనుసంధానం చేయాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. పలు రకాల సమాచారంతో ఆన్లైన్లో పొందుపరచాలంటే గంటల తరబడి ఒకే గృహంలో వేచి చూడాల్సి వస్తుందని కార్యదర్శులు పేర్కొంటున్నారు. 20 పేజీల చిట్టా గంటల తరబడి వెతకాల్సిందేనని వివరిస్తున్నారు. ప్రతి ఇంటి సమాచారం సేకరించి మాన్యువల్ తో పాటు ఆన్లైన్ లో పొందుపరచాలి అంటే పాట్లు పడాల్సిందే కుటుంబాల సమాచారం తీసుకొని పొందుపరచడంతోపాటు సర్వర్ స్లో నెట్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు వివరిస్తున్నారు. అదేవిధంగా పెద్ద పంచాయతీలలో చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, చెన్నూరు, పేరు వంచ, బత్తులపల్లి, ముచ్చవరం, ఎర్ర బోయినపల్లి తదితర గ్రామపంచాయతీలలో జనాభా ఎక్కువ ఉన్నందున అనుసంధానం ఆలస్యమవుతున్నందున కార్యదర్శులు కష్టాలు పాలవుతున్నారు.



**రాత్రి వేళల్లో నరకం...**

రాత్రి వేళల్లో సేవలు ఆలస్యంగా నడవడం కుటుంబాలకు దూరంగా ఉండటం పగలు ఇంటింటికి తిరగడం లాంటి కార్యక్రమాలకు ఉండటంవల్ల కార్యదర్శులు సాయంత్రం వేళల్లో జూమ్ మీటింగులు సమయపాలన లేకుండా సమావేశాలు అధికారులు ఏర్పాటు చేయడం వలన దీర్ఘకాలిక వ్యాధులకు లోను అవుతున్నారని వారు వివరిస్తున్నారు.

**గ్రామాల్లో పడకేసిన పనులు..**

గ్రామపంచాయతీలలో డేటా ఎంట్రీలు నిర్వహించాల్సిన విధులు డిజిటల్ ఒత్తిడిలో భాగంగా పంచాయతీ పనులు చేయలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ విధంగా ఈ పనుల్లో ఉండటం వలన కుటుంబ పనుల్లో బాగోగులు చూడలేకపోతున్నామని వివరిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులకు ప్రతి పనికి సమయపాలన కేటాయించి ఒక పని అయిపోయిన తర్వాత మరో పని కేటాయించాలని పంచాయతీ కార్యదర్శులను ఇబ్బందులు పెట్టకుండా ఒత్తిడి పెట్టకుండా ప్రభుత్వ మరియు ఉన్నతాధికారులు ఇబ్బందులు లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు మొరపెట్టుకుంటున్నారు.

# ఆర్టిసిలో మోగిన ఎన్నికల నగారా

**(మొదటిపేజీ తరువాయి)** పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు జరుగుతాయి. అక్టోబర్ 17న ఓట్ల లెక్కింపు జరుగుతుంది అదే రోజుల ఫలితాలను వెల్లడిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 36వేల మంది ఓటర్లు ఉండగా ఖమ్మం రీజియన్ పరిధిలో 1700 మంది ఓటర్లు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ అతిపెద్ద కార్మిక సంఘంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఆ తర్వాత పలుమార్లు ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపు సంఘంగా ఎన్నికైంది. ఈ దఫా మిత్రులుగా కొన్ని సంఘాలు పోటీ చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో గుర్తింపు కోసం ప్రత్యర్థిపై ఒక ఓటు అదనంగా వచ్చిన విజేతగా ప్రకటిస్తారు. కానీ రీజియన్ స్థాయిలో గుర్తింపు పొందాలంటే 51 శాతం ఓట్లను తెచ్చుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో గుర్తింపు సంఘంగా ఉన్న వారికి రీజియన్‌లో ప్రాతినిథ్యం లభిస్తుంది.

# ప్రాణం తీసిన నిర్లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)** నిలిపివేయడంతో చివరకు ఆమె ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో లక్ష్మి దేవి అనే గ్రూపులో కర్రి అనసూర్య (53) సభ్యురాలు. ఆమె గ్రూపు ద్వారా వచ్చిన రుణాన్ని సకాలంలో చెల్లిస్తూ ఉండేది. 2021 సంవత్సరంలో భర్త మరణించడంతో రుణం కూడా తీసుకోవడం లేదు. రుణం తీసుకుంటే చెల్లించే మార్గం లేదన్న భావనతో ఆమె రుణానికి దూరంగా ఉంది. గ్రూపులో సభ్యులుగా ఉన్న మిగిలిన తొమ్మిది మంది రుణం తీసుకునే వారు. 2025లో తీసుకున్న రుణం సభ్యులు సక్రమంగా చెల్లించకపోవడం బ్యాంకు అధికారులు సంఘంలోని సభ్యుల వ్యక్తిగత ఖాతాలను నిలిపి వేశారు. దీనితో అనసూర్యకు పింఛన్ డబ్బులు రాకపోవడంతో ఆమె అటు అధికారులకు, ఇటు సెర్ప్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు తన గోడు వివరించింది. మే నెలలో ఒకసారి ఖాతాను పునరుద్ధరించిన తిరిగి నిలిపివేయడంతో ఆమె మందులు లేకపోవడంతో అనారోగ్యానికి గురైంది. దీనికి తోడు మానసిక వేదనతో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందింది. అనసూర్య మృతికి బ్యాంకు అధికారులే కారణమని దీనికి తోడు వివోఏ బాధ్యుడని మృతురాలి బంధువులు బ్యాంకు వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనను విరమించారు. అనసూర్య మరణానికి కారకులైన బ్యాంకు సిబ్బంది, వివోఏపై చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

# అశ్రునయనాల నడుమ రామిరెడ్డి అంత్యక్రియలు



**ప్రజాపక్షం/ తల్లాడ :** మాజీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గువ్వల రామిరెడ్డి అంత్యక్రియలు శుక్రవారం అశ్రునయనాల మధ్య అశేష జనవాహిని సమక్షంలో నిర్వహించారు. రామిరెడ్డి మృతిపట్ల మండలంలోని పలువురు రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఘనంగా నివాళులర్పించారు. రామిరెడ్డి అంతిమ యాత్రలో వివిధ పార్టీల మండల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, తల్లాడ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పెరికె నాగేశ్వరరావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కిరెడ్డి, సుధాకర్, రామారావు, బాబు, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, బసవయ్య, అప్పారావు, శంకర్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు పాల్గొన్నారు.

# నూతనకల్‌లో అన్నదాన కార్యక్రమం



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం నూతనకల్ గ్రామంలో వినాయక నవరాత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, నాయుడు శ్రీనివాసరావు, శెట్టిపల్లి లక్ష్మణరావు, కళ్యాణపు కృష్ణయ్య, కళ్యాణపు వెంకటేశ్వరరావు, అడపా అనిల్, వైస్ సర్పంచ్ తెనాలి సత్యం, నాయకులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలందరూ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ నాగులమీరా, ప్రభాకర్, శ్రీను, పాపారావు, మధు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో
# వినాయక నిమజ్జనం నిర్వహించాలి

**-ఎస్ఐ మేడ ప్రసాద్**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించాలని ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గణేష్ ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఎస్ఐ మేడ ప్రసాద్ మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు మురళీకృష్ణ చార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గణేష్ ఉత్సవ కమిటీ ఛైర్మన్ రంగు ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎస్ఐ మేడ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఐ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వినాయక నిమజ్జనత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. నిమజ్జన కార్యక్రమంలో భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# హరిత ఇంధనం వైపు పరుగులు.. కాలుష్యానికి చెక్..!





**-సౌర, పవన, గ్రీడ్ హైడ్రోజన్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం**
**-యువతకు కొత్త ఉపాధి అవకాశాలు**



**ప్రజాపక్షం/తల్లాడ :** వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, శిలాజ ఇంధనాలపై ఆధారపడటం వంటి సమస్యలకు పరిష్కారంగా ప్రపంచ దేశాలు హరిత ఇంధన రంగం వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి.సౌరశక్తి, పవనశక్తి, జల విద్యుత్, బయోగ్యాస్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన వనరులు భవిష్యత్తు ఇంధన అవసరాలను తీర్చడంలో కీలకంగా మారుతున్నాయి. మన దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తికి విస్తృత అవకాశాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఖాళీ భూములు, ఇండ్ల పైకప్పులు, వ్యవసాయ భూముల వద్ద సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఉత్పత్తితో పాటు రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంది. పవన విద్యుత్ కూడా హరిత ఇంధన రంగంలో మరో ముఖ్యమైన వనరు. గాలి వేగం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో విండ్ టర్బైన్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చు. అదేవిధంగా వ్యవసాయ వ్యర్థాలు, పశువుల వ్యర్థాలతో బయో గ్యాస్ తయారు చేసి ఇంధనంగా వినియోగించవచ్చు.

### యువతకు కొత్త ఉపాధి అవకాశాలు...

హరిత ఇంధన రంగం కేవలం విద్యుత్ ఉత్పత్తికే పరిమితం కాదు. సౌర ప్యానెళ్ల తయారీ, ఏర్పాటు, నిర్వహణ, బ్యాటరీ సాంకేతికత, ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో భారీగా ఉద్యోగ, వ్యాపార అవకాశాలు ఏర్పడుతున్నాయి. గ్రామీణ యువతకు సౌర పరికరాల నిర్వహణ, ఇన్‌స్టాలేషన్ వంటి నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తే స్థానికంగానే ఉపాధి పొందే అవకాశం ఉంటుంది. వ్యవసాయ రంగంలో సౌర పంపుసెట్ల వినియోగం పెరిగితే డీజిల్, విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తితో పాటు పంటల సాగు కొనసాగించే అగ్రివోల్టాయిక్స్ విధానం భవిష్యత్తులో మరింత ప్రాధాన్యం పొందే అవకాశం ఉంది.

### హరిత ఇంధన రంగంలో సవాళ్లు ...

హరిత ఇంధన రంగం అభివృద్ధికి కొన్ని సవాళ్లు ఉన్నాయి. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి వాతావరణ పరిస్థితులపై ఆధారపడటం, విద్యుత్ నిల్వకు పెద్ద స్థాయి బ్యాటరీలు అవసరం కావడం, ప్రారంభ పెట్టుబడులు అధికంగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయి. వీటికి మెరుగైన బ్యాటరీ సాంకేతికత, విద్యుత్ గ్రిడ్ ఆధునీకరణ, పరిశోధన, ప్రభుత్వ ప్రోత్సహాకాలు అవసరం.

### భవిష్యత్తు హరిత ఇంధనానిదే...

కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించాలంటే పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని మరిం త పెంచాలి. ప్రభుత్వం పరిశ్రమలు, రైతులు, యువత, ప్రజలు కలిసి అడుగులు వేస్తే హరిత ఇంధనం స్వచ్ఛమైన పర్యావరణంతో పాటు బలమైన ఆర్థిక వ్యవస్థకు కూడా పునాది కావచ్చు.

# హోమియోపతి ఆసుపత్రిలో పాటించని సమయపాలన..!?

**ఉదయం 11గంటల తర్వాతే తెరుచుకుంటున్న ఆసుపత్రి**
**-సిబ్బందే మందులు ఇస్తున్నారన్న ఆరోపణలు**
**-అధికారుల పర్యవేక్షణ కరువు**
**-ఇబ్బందులు పడుతున్న రోగులు**




**ప్రజాపక్షం/వైరా:** ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన హోమియో ప్రభుత్వ వైద్యశాలలో సమయపాలన గాడి తప్పిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైరాలోని తెలంగాణ రాష్ట్ర హోమియో వైద్యశాల పరిధిలోని హోమియోపతి వైద్యశాలలో ఉదయం నిర్ణీత సమయానికి వైద్య సేవలు అందుబాటులో ఉండటం లేదని రోగులు వాపోతున్నారు. ఉదయం 11 గంటల తర్వాతే వైద్యశాల తలుపులు తెరచుకుంటున్నాయని, ఒక్కోసారి 11.30 గంటలు దాటినా సిబ్బంది అందుబాటులోకి రాని పరిస్థితి ఉంటుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. హోమియోపతి వైద్యశాలలో వైద్యులు సమయానికి అందుబాటులో ఉండటం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యసేవల కోసం వచ్చిన వారు వైద్యుల కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అంటున్నారు. ముఖ్యంగా పేద, మద్యతరగతి కుటుంబాలకు చెందిన పలువురు హోమియోపతి వైద్యంపై ఆధారపడుఉంటే, వైద్యులు అందుబాటులో లేకపోవడం వారికి ఇబ్బందిగా మారుతుందని చెబుతున్నారు. వైద్యులు అందుబాటులో లేని సమయంలో కార్యాలయ సిబ్బంది రోగులకు మందులు అందిస్తున్నారనే ఆరోపణ కూడా వినిపిస్తున్నాయి. రోగిని పరీక్షించి వ్యాధి లక్షణాలను అంచనా వేసి మందులు సూచించాల్సిన చోటు వైద్యులు లేకుండా ఇతర సిబ్బంది మందులు ఇస్తే బాధ్యత ఎవరిది? అని ప్రజలు ప్రశిస్తున్నారు.

### ఆఫీస్ సిబ్బందే వైద్యులా..?

వైద్యశాలకు సంబంధించిన కార్యాలయ సిబ్బంది సమయానికి వచ్చి విధులు నిర్వహిస్తున్నారా? వైద్యులు ఎందుకు అందుబాటులో ఉండటం లేదు..? విధులకు గైర్హాజరవుతున్నట్లయితే ఉన్నతాధికారుల అనుమతి ఉందా? సెలవు లేదా డిప్యుటేషన్‌పై ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వైద్యశాల తలుపులే ఉదయం 11 గంటల తర్వాత తెరుచుకుంటున్నాయనే ఆరోపణలు సంబంధిత అధికారులు స్పందించి వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యశాలకు వచ్చే రోగులకు నిర్ణీత సమయాలో వైద్యసేవలు అందుతున్నాయా ఏదా అన్న దానిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. హోమియోపతి వైద్యశాలకు వచ్చే రోగులకు వైద్యుల సూచన మేరకే మందులు అందించాల్సి ఉంటుంది. అయితే వైద్యులు అందుబాటులో ఏని సమయంలో సిబ్బంది మందులు అందిస్తున్నారనే ఆరోపణలు నిజమైతే అది మరింత తీవ్రమైన విషయమని ప్రజలు అంటున్నారు. ఏ మందు ఎందుకు ఇస్తున్నారు? రోగి సమస్యకు అది సరైన మందేనా? అనే విషయాన్ని వైద్యుల పర్యవేక్షణ లేకుండా ఎలా నిర్ధారిస్తారు? అని ప్శ్నిస్తున్నారు. ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటు చేసిన వైద్యశాలలో వైద్యసేవలు సక్రమంగా అందేలా సంబంధిత శాఖ ఉన్నతాధిఆరులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. వైద్యుల హాజరు, ఆసుపత్రి ప్రారంభ సమయం, ఓపి రిజిస్టర్, మందుల పంపిణీ, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానిఇక సంబంధించిన ప్రభుత్వ వైద్యశాలలోనే సమయపాలన కనిపించకపోతే పర్యవేక్షణ వ్యవస్థ ఏం చేస్తుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వైద్యశాలలో పూర్తిస్థాయి వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైరా ప్రజలు కోరుతున్నారు.

# పరిశుభ్రతే ధ్యేయం..రోగాల నివారణే లక్ష్యం



**ప్రజాపక్షం/కామేపల్లి:** ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కెప్టెన్ బంజారా గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. వీధులు, మురుగు కాలువలు, బహిరంగ ప్రదేశాల్లో విస్తృతంగా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఆరేం అచ్చమ్మ మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టేందుకు ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పరిశుభ్రత పంచాయితీ సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు. గ్రామంలో పారిశుధ్య పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని సర్పంచ్ తెలిపారు.

# ఫారంపాండ్ నిర్మాణంతో భూగర్భజలాల పెంపు



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఫారంపాండ్ నిర్మాణంతో భూగర్భజలాల పెంపు జరుగుతుందని, తద్వారా ఎలీనో వంటి విపత్కర పరిస్థితులు వచ్చినప్పుడు నీటి ఇబ్బందులు రాకుండా తట్టుకోవచ్చని డిఆర్‌డిఏ పిడి విద్యచందన రైతులకు సూచించారు. శుక్రవారం చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఫారంఫాండ్‌ను ఆమె పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ రైతులు తమ వ్యవసాయభూముల్లో కచ్చితంగా ఫారంఫాండ్ తవ్వించుకోవాలని, తద్వారా భూగర్భజలాల పెరుగుదల సులభతరం అవుతుందన్నారు. ప్రతి రైతు తమ వ్యవసాయ బోరు మోటర్ల ద్వారా భూగర్భ జలాల తోడకం చేస్తున్నారని, ఫారంఫాండ్ వల్ల భూమిలో నీటిని ఇంకించే పని మొదలవుతుందన్నారు. ప్రస్తుత ఎలీనో ప్రభావంతో కరువు పరిస్థితుల దృష్ట్యా కూలీలకు ఉపాధి సైతం దొరుకుతుందన్నారు. ప్రతి వాన చినుకును ఒడిచి పట్టే యంత్రం లాంటిదే ఫారంఫాండ్ అన్నారు. ఆమె వెంట ఎంపీడీవో అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఎస్టీల రిజర్వేషన్‌ను 6 నుంచి 10శాతానికి పెంచిన సందర్భంగా చంద్రుగొండలో బీఆర్‌ఎస్ గిరిజన నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. శుక్రవారం ప్రధాన సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఏ మెచ్చా నాగేశ్వరరావు చిత్రపటానికి కూడా పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ ఎస్టీ రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచారని గుర్తు చేసుకున్నారు. ఈ నిర్ణయానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కృతజ్ఞతగా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గిరిజన నాయకులు ప్రవీణ్, ప్రకాష్, కృష్ణవేణి, కే లోత్ శ్రీను, శ్రావన్, రాంబాబు, బీఆర్‌ఎస్ నాయకులు కొనగండ్ల వెంకటరెడ్డి, దార బాబు, నల్లమోతు వెంకటనారాయణ, మేడ మోహన్‌రావు, భూపతి రమేష్, భూపతి శ్రీనివాసరావు, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల వద్ద భక్తుల కోలాహలం



**ప్రజాపక్షం/కారేపల్లి:**గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తిశ్రద్ధలు చాటుకుంటున్నారు. రాత్రి వేళ ఆయా వీధుల నుంచి భక్తులు మండపాల వద్దకు చేరుకుని ఆటపాటలు, కోలాట నృత్యాలతో ఉత్సాహంగా గడుపుతున్నారు. కారేపల్లిలోని యాదవనగర్‌లో కోలాట నృత్యాలతో గణనాథుడిని కొలుస్తుండగా, బొడ్రాయి సెంటర్, బీసీ కాలనీ, ఛత్రపతి గణేష్ సెంటర్, గణేష్ సెంటర్, పెద్దమ్మ బజార్, పాత శివాలయం, రైల్వే స్టేషన్ రోడ్డు శివాలయం, భారత్‌నగర్, శ్రీ వెంకట సాయినగర్ వెంచర్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది.

# పీఆర్సీని వెంటనే అమలు చేయాలి




**ప్రజాపక్షం/కూసుమంచి:** పీఆర్సీని వెంటనే అమలు చేయడంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని పీఆర్టీయూ టీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కట్టా శేఖర్‌రావు డిమాండ్ చేశారు. కూసుమంచిలో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు పీఆర్సీ అమలు చేయకపోవడం, సీపీఎస్ కొనసాగించడం, పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలు విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేసి, ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలని కోరారు. ఈసమావేశంలో మండల అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ఎం సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కెవి కృష్ణారావు, రాష్ట్ర కార్యదర్శులు ఏ లక్ష్మీనారాయణ, కె అనంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి సోమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు తాళ్లూరి చంద్రశేఖర్, పి శోభన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# యూపీఐ ఎండీఆర్‌ను ఉపసంహరించుకోవాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** యూపీఐ లావాదేవీలకు సంబంధించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్(ఎండీఆర్)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఆధ్వర్యంలో ములకలపల్లి సెంటర్‌లో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా మాస్‌లైన్ జిల్లా కమిటీ సభ్యుడు పోతుగంటి లక్ష్మణ్ మాట్లాడుతూ డిజిటల్ చెల్లింపులపై ఎండీఆర్ విధానం సామాన్యులు, వ్యాపారులపై భారం పెంచుతుందని విమర్శించారు. వ్యాపారులపై పడే అదనపు వ్యయం చివరకు వినియోగదారులపైనే పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ లావాదేవీలను మరింత సరళంగా ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మూకమామిడి సర్పంచ్ కొర్సా ఆదిలక్ష్మీ, పార్టీ సంయుక్త మండల కార్యదర్శి కొర్సా రామకృష్ణ, నాయకులు శాస్త్రిబోయిన వెంకటేశ్వర్లు, ఎర్రగొర్ల రామారావు, నూపా సరోజని, నకరికంటి నాగేశ్వరరావు, మిడియం వసంత్, వెలకం కన్నయ్య, సొడె అనురాధ, గుర్రం లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక



**- పండుగలు ప్రజల ఐక్యతకు దోహదం**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గంగా జమున తహెజీబ్‌తో విలసిల్లుతున్న కొత్తగూడెం పారిశ్రామిక ప్రాంతం మత సామరస్యానికి నిలయమని సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కే సాబీర్ పాషా పేర్కొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ 50వ డివిజన్, నెహ్రూబస్తీలో ఎస్ఎం సిసి ఆధ్వర్యంలో కొలువుదీరిన గణేష్ మండపాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. నిర్వాహకులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల మధ్య ఐక్యతను సోదరభావాన్ని పెంపొందించేందుకు పండుగలు ఉత్సవాలు ఎంతో దోహదపడతాని మన పూర్వీకుల నుంచి వస్తున్న ఘనమైన సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి తరంపై ఉందన్నారు. గత 18 సం.లుగా ఎస్ఎం సిసి కమిటీ అన్ని వర్గాల పండుగలను సమిష్టిగా వైభవంగా నిర్వహిస్తూ ప్రజా ఐక్యతను చాటడం ఎంతో అభినందనీయం అన్నారు. వేడుకలు సమాజంలో ఆత్మీయతను పరస్పర ప్రేమానురాగాలను బలోపేతం చేస్తాయన్నారు. నేటి యువత కేవలం ఉత్సవాలకే పరిమితం కాకుండా బస్తీలోని ప్రజా సమస్యల పరిష్కారానికి సామాజిక సేవా రంగాల్లో చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్ యర్ర రాజు కసరబోయిన రమేష్ పసుపులేటి భరత్ పొన్నం అజయ్ సాంబ చోట షరీఫ్ అంజన రావు వరప్రసాద్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# వెదురు పెంపకంతో పర్యావరణ పరిరక్షణ : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వెదురు పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాలను పెంపొందించవచ్చని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బిసి అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడిఓసి సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెదురు వేగంగా పెరిగే సహజ వనరని, పచ్చదనం పెంపుతో పాటు నేలకోతను నియంత్రించడంలో కీలక పాత్రను పోషిస్తుందన్నారు. ఇళ్ల నిర్మాణం , గృహోపకరణాలు, కాగితం హస్తకళలు అలంకరణ వస్తువులు తయారీలో వెదురును విస్తృతంగా వినియోగిస్తున్నారని చెప్పారు. వెదురు ఆధారిత ఉత్పత్తులకు ఉన్న మార్కెటింగ్ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కళాకారులు చేతివృత్తిదారులకు సూచించారు. సంప్రదాయ నైపుణ్యాలకు ఆధునిక సాంకేతిక జోడించి ఆదాయం పెంచుకోవచ్చన్నారు. బిసి వర్గానికి



చెందిన కళాకారులను వెదురు ఉత్పత్తుల తయారీ వైపు ప్రోత్సహించి మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బిసి అభివృద్ధిశాఖ అధికారి విజయలక్ష్మీ, మేదరి కుల సంఘం నాయకులు కొంటు శ్రీనివాస్ స్వరూప సింధూజ కళావతి రమాదేవి పిల్లి శ్రీను సోమయ్య బొల్లం శ్రీనివాస్ ప్రవళ్లికతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## ఇల్లందును కరువు మండలంగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్)ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. బోయితండా మాజీ సర్పంచ్ బానోత్ సంతు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మూడ్ మాలు, అధ్యక్షుడు పూనెం కోటన్న మాట్లాడారు. వర్షాభావంతో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాపకతంగా రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో చిన్నస్వామి, ధర్మన్న, భాస్కర్, రాజు, తోడేటి నాగేశ్వర రావు, రాసుద్దీన్, జోగా కృష్ణ, మోతిలాల్, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలో గిరిజనుల అభివృద్ధి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ రేగా కాంతారావు పిలుపు మేరకు ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఎస్టీ రిజర్వేషన్‌ను 6 నుంచి 10శాతానికి పెంచిన నిర్ణయాన్ని గుర్తు చేసుకుంటూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మాజీ



జెడ్‌పిటిసి కొమరం హనుమంత్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె బాబా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో తండాలు, గూడేలను గ్రామ పంచాయితీలుగా గుర్తించడం, గిరిజన విద్యార్థులకు గురుకులాలు, హాస్టళ్లు, స్కాలర్ షిప్‌లు, ఉన్నత విద్యకు ప్రోత్సాహం, పోడు భూములకు ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు, గిరి వికాసం, ట్రైకార్ ద్వారా స్వయం ఉపాధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పాతూరు సర్పంచ్ ఈసం రుక్మిణి, ఆళ్లపల్లి ఉప సర్పంచ్ అరీఫ్, రాయపాడు ఉప సర్పంచ్ పూనం నాగేష్, మండల నాయకులు పూనం ప్రసాద్, రఘుపతి, తాటి నరసింహారావు, కొమరం వెంకటకృష్ణంరాజు, తాళ్లపల్లి ఎల్లాగౌడ్, పూనెం రమణ, జార భాస్కర్, ఊకె లలిత, కుంజా వెంకట్, ఆదాం, చింటు, కల్తి నాగేష్, గొగ్గేల ప్రశాంత్, గొగ్గేల గోపాల్, గొగ్గేల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుంకుమ పూజ

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచలో వివిధ కాలనీల్లో నెలకొల్పిన వినాయక మండపాల్లో ఈ నెల 14 నుండి ప్రారంభమైన వినాయక చవితి ఉత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజుల పాటుగా కొనసాగే ఉత్సవాలలో భాగంగా శుక్రవారం పలు కాలనీలలో ప్రతిష్టించిన వినాయక మండపాలలో శుక్రవారం పురస్కరించుకొని మహిళా భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో కుంకుమ పూజలు నిర్వహించారు. వర్తకసంఘం ఆధ్వర్యంలో 60 ఏండ్లుగా నెలకొల్పుతున్న శ్రీ ఈశ్వర్ గణేష్ మహల్‌లో నవరాత్రి వేడుకలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి అధ్యక్షులు యచలవాది ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్, కోశాధికారి బచ్చు శ్రీనివాస్, మహిళా సేవాదళ్ అధ్యక్షులు పెండ్యాల రోజాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలి

**-జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు**

**ప్రజాపక్షం/ములకలపల్లి:** వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు అన్నారు. శుక్రవారం పొగళ్లపల్లి రైతు వేదికలో ఏటీఎంఏ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటల సాగు, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల ఎంపిక, ఎరువులు,



నీటి యాజమాన్యంతో వ్యవసాయ శాఖ సూచనలు పాటిస్తే ఉత్పాదకత పెంచుకోవచ్చన్నారు. అనంతరం కేవీకే కొత్తగూడెం కోఆర్డినేటర్ భరత్ మాట్లాడుతూ పంట వైవిధ్యం, ఆయిల్‌పామ్, నూనెగింజలు, ప్రత్యామ్నాయ పంటలు, సమగ్ర వ్యవసాయంపై వివరించారు. అదే విధంగా పొగళ్లపల్లి సర్పంచ్ మిడియం రవి మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ పద్ధతులు అవలంబించి వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సుజాత, రమేష్, సూరిబాబు, రైతులు పాల్గొని అధికారులతో సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## వినాయకుడి వద్ద మహా అన్నదానం

**ప్రజాపక్షం/గుండాల:** మండలంలోని అమ్మ మెస్ సెంటర్‌లో కొలువుదీరిన వర సిద్ధి వినాయక మండపం వద్ద గణేష్ ఉత్సవాల్లో భాగంగా శ్రీ వినాయక భక్తి సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ముఖ్యఅతిథులుగా గుండాల తహసీల్దార్ బి సంగీత, ఎస్ఐ శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కమిటీ నిర్వాహకులు



మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి ఏడాది అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గడ్డం హేమంత్‌కుమార్, గుండెబోయిన రాత్విక్, గామాలపాటి రాహుల్, గడ్డం సుమంత్, ఎస్ చైతన్య, ఎస్ హర్షిత, ఎం శ్రీరామ్, ఎం వంశీ, ఆర్ వివేకసింగ్, పి సందీప్, ఎండి అజ్మత్, వి మణి సాత్విక్, జి సాయి, ఎస్‌కె యాసిన్, ఎస్ లాలయ్య, జి లక్ష్మీ నారాయణ, జి రామకృష్ణ, జి నవీన్, ఎస్ వినోద్, జి సురేష్, భక్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్యశాల తరలింపుతో రైతుల్లో ఆందోళన

**ప్రజాపక్షం/కామేపల్లి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరడంతో శుక్రవారం పింజర మడుగులోని గోపాలమిత్ర భవనానికి తాత్కాలికంగా తరలించారు. పాత భవనం ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉండటంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే పశువైద్యశాలను దూర ప్రాంతానికి తర



లించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర సమయాల్లో పశువులకు వైద్యసేవలు అందడం కష్టమవుతుందని, మూగ జీవాలకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నూతన భవన నిర్మాణానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నూతన పశువైద్యశాల భవన నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

## లచ్చిగూడెం, కే నారాయణరావుపేటలో వైద్యశిబిరాలు

**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లచ్చిగూడెం గ్రామం, కే నారాయణరావుపేట బాలికల వసతి గృహంలో డాక్టర్ రుక్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. లచ్చిగూడెంలో 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జ్వరంతో బాధపడుతున్న ఐదుగురికి మలేరియా పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించారు. డ్రైడే కార్యక్రమంలో భాగంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వసతి గృహంలో విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అనారోగ్యంతో ఉన్న వారికి చికిత్స అందించారు. వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తడి దుస్తులు ధరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వంటశాలను పరిశీలించిన వైద్య బృందం ఆహార పదార్థాలు, వంటగది పరిశుభ్రత, ఆహార భద్రతపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సీహెచ్ఓ టీ బాబురావు, హెల్త్ అసిస్టెంట్ ధర్మయ్య, ఎంటీఎస్ రామకృష్ణ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సమాజ నిర్మాణానికి సిద్ధం కావాలి

**ప్రజాపక్షం/ఇల్లందు:** మహనీయులు కలలు కన్న నూతన సమాజ నిర్మాణం కోసం సిద్ధాంతిక పోరాటాలకు సిద్ధం కావాలని పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. ఉద్యమ లక్ష్యాల సాధనకు క్షేత్రస్థాయిలో సంస్థాగత నిర్మాణాలను బలోపేతం చేయాలని సూచించారు. ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి గ్రామ, మండల కమిటీలను ఈనెల 30లోగా పూర్తి చేయాలని, విద్యాసంస్థలు ఉన్న ప్రతి చోట ఎంఎస్ఎఫ్ కమిటీలను ఏర్పాటు చేసి అక్టోబర్ 6న నిర్వహించే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి సిద్ధం కావాలని కోరారు. ఎంఎల్ఎఫ్ ఆధ్వర్యంలో కోర్టులు ఉన్న ప్రాంతాల్లో కమిటీలు ఏర్పాటు చేసి జిల్లా మహాసభలు నిర్వహించడంతో పాటు ఛలో సూర్యాపేటకు సన్నద్ధం కావాలన్నారు. ఎంఎంఎస్, ఎంఎంఎం విభాగాలకు జిల్లా మహాసభలు నిర్వహించి జిల్లా కమిటీలను ఏర్పాటు చేయాలని, అక్టోబర్ 2న మద్యపాన నిషేధం కోరుతూ జిల్లా కేంద్రాల్లో చేపట్టే ధర్నాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మిగిలిన అన్ని విభాగాలు తమ సంస్థాగత నిర్మాణాలను ప్రారంభించాలని మంద కృష్ణ మాదిగ సూచించారు.

## చదువుతో ఉన్నత శిఖరాలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** కష్టపడతూ, ఇష్టపడుతూ ఏకాగ్రతతో చదువుకోవాలని, చదువు ఒక్కటే ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు హెచ్. శ్రీనివాసరావు వాణిజ్య



విభాగంలో, భూక్యా నరసింహారావు కంప్యూటర్ సైన్స్ విభాగంలో యూజిసి నెట్ పరీక్షలలో అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పద్మ ఆధ్వర్యంలో శుక్రవారం అధ్యాపకులను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కళాశాలకు చెందిన ఇద్దరు లెక్చరర్‌లు యూజిసి నెట్‌లో అర్హత సాధించటం మనకు గర్వకారణమన్నారు. వారి విజయాలు విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయని చెప్పారు. అధ్యాపకులు బోధనతో పాటుగా పరిశోధనా రంగంలో కూడా మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులుపాల్గొన్నారు.

# మత్స్యకారులకు నష్ట పరిహారం చెల్లించాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ధంసలాపురం చెరువుపై ఆధారపడి జీవిస్తున్న మత్స్యకారులకు నష్ట పరిహారం చెల్లించాలని లేని పక్షంలో నిమజ్జనాన్ని అడ్డుకుంటామని మత్స్యకారుల సొసైటీ సభ్యులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెంలో మత్స్యకార సొసైటీ అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా నిమజ్జనాన్ని అధికారులు ధంసలాపురం చెరువులో ఏర్పాటు చేస్తున్నారన్నారు. మున్నేరుకి వరద వచ్చి నీరు ఉన్నందున ధంసలాపురం చెరువులో కాకుండా మున్నేరులోనే వినాయక విగ్రహాల నిమజ్జనాన్ని నిర్వహించాలన్నారు. ధంసలాపురం చెరువులో నిర్వహిస్తే మత్స్యకారులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఆ చెరువుపై 80 కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఇప్పటికే మత్స్యకారులు లక్షల్లో అప్పులు తెచ్చి చేపల పెంపకం చేపడుతున్నారన్నారు. గతంలో చేపలు చనిపోయినప్పుడు నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పినా ఇంత వరకు అధికారులు చెల్లించలేదన్నారు. నిమజ్జనం వల్ల చేపలు చనిపోవడంతో పాటు మత్స్య



కారులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. విగ్రహాల్లో ఉండే ఇనుప చువ్వలు చేపల వేటకు వెళ్లే వారికి గుచ్చుకునే ప్రమాదం ఉందన్నారు. రసాయనాలు నీటిలో కలవడం వల్ల మూగజీవాలకు కూడా ప్రమాదం ఉందన్నారు. నష్ట పరిహారం చెల్లించకుండా నిమజ్జనం చేస్తే అడ్డుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి పోతురాజు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పగడాల శ్రీను, సభ్యులు రావుల హన్మంతరావు, నాయకులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, చాగంటి వెంకట నర్సయ్య, ఎం. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రెండు రోజుల పాటు రఘునాథపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ క్రీడా పోటీల్లో మండలంలోని 18 పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వాలీబాల్ సీనియర్ బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం జెడ్పిహెచ్ఎస్ మంచుకొండ నిలిచింది. వాలీబాల్ బాలికల విభాగంలో ప్రథమ స్థానం జెడ్పిహెచ్ఎస్ కామంచికల్ ద్వితీయ స్థానం ఎంజెపిటి దానవాయి గూడెం, కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ స్థానం ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం జెడ్పిహెచ్ఎస్ కామంచికల్, బాలికల విభాగంలో ప్రథమ స్థానం జెడ్పిహెచ్ఎస్ కామంచికల్, ద్వితీయ స్థానం ఎంజెపిటి చెరువు మాధారం, ఖోఖో బాలుర విభాగం ప్రథమ స్థానం ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం జెడ్పిహెచ్ఎస్ చిమ్మపుడి, బాలికల విభాగం ప్రథమ స్థానం ఎంజెపిటి దానవాయిగూడెం, ద్వితీయ స్థానం టిజిఎంఆర్ఎస్ రఘునాథపాలెం పాఠశాల నిలిచాయి. జూనియర్ విభాగంలో వాలీబాల్ ప్రథమ స్థానం ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం జెడ్పిహెచ్ఎస్ మంచుకొండ, బాలికల విభాగం ప్రథమ స్థానం జెడ్పిహెచ్ఎస్ చిమ్మపుడి, ద్వితీయ స్థానం టిఎంఆర్ఎస్ రఘునాథపాలెం, కబడ్డీ బాలుర విభాగం ప్రథమ స్థానం ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం కామంచికల్, బాలికల విభాగం ప్రథమ స్థానం రఘునాథపాలెం, ద్వితీయ స్థానం మంచుకొండ, ఖోఖో బాలురు విభాగంలో ప్రథమ స్థానం, ఎంజెపిటి రఘునాథపాలెం, ద్వితీయ స్థానం చిమ్మపూడి, బాలికల విభాగం ప్రథమ స్థానం ఎంజెపిటి దానవాయిగూడెం, ద్వితీయ స్థానం టిజిఎంఆర్ఎస్ రఘునాథపాలెం పాఠశాలలు నిలిచాయి. బహుమతి ప్రధానోత్సవంలో సర్పంచ్ గాజుల కృష్ణారావు, ఎంఈవో బి. రాములు, ఉప సర్పంచ్ బి. ప్రశాంత్, ఎస్‌జిఎఫ్ మండల కన్వీనర్ ఎం. వెంకటేశ్వర్లు పాల్గొని విజేతలకు మెడల్స్, షీల్డ్స్ అందజేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో కూడా ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల హెచ్ఎంలు, పిడి, పిఈటిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతుకు లాబీయింగ్‌లు

**-మమల్ని లాగొద్దంటున్న ఫెర్టిలైజర్ డీలర్**
**-రైతు కుటుంబ సభ్యులతో బేరానికి దిగుతున్న ఆర్గనైజర్**
**-"గొడవలు వద్దు.. కూర్చొని మాట్లాడుకుందాం" అంటూ ఫోన్లు**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** "రైతులను ముంచుతున్న ఆర్గనైజర్ల మాయాజాలం" శీర్షికన ప్రజాపక్షంలో శుక్రవారం ప్రచురితమైన కథనం నేపథ్యంలో సంబంధిత ఫెర్టిలైజర్ డీలర్, ఆర్గనైజర్‌లు దిద్దుబాటు చర్యలకు దిగుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంటకు అవసరమైన సీడ్, ఎరువులు, మందుల పేరుతో రైతుల ఖాతాల్లో వాస్తవానికి మించిన ఖర్చులు చూపించారంటూ రైతు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం సీతారాంపురానికి చెందిన ఓ వ్యక్తి మొక్కజొన్న సీడ్ కంపెనీలో ఆర్గనైజర్‌గా వ్యవహరిస్తూ సదాశివునిపాలెం గ్రామానికి చెందిన ఓ రైతుకు 12 ఎకరాలకు సీడ్ అందించినప్పటికీ సంబంధిత ఎరువుల దుకాణంలో మాత్రం 16 ఎకరాలకు మందులు, ఎరువులు ఇచ్చినట్లు నమోదు చేసినట్లు రైతు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రైతు పేరుతో ఎరువుల దుకాణంలో ఖాతా తెరిచి, ఆర్గనైజర్‌డీలర్‌లు కలిసి వాస్తవానికి మించిన ఖర్చులు చూపించారని రైతు కుమారుడు ఆరోపిస్తున్నాడు. తమకు తెలిసిన లెక్కల ప్రకారం ఎకరానికి సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అదనపు ఖర్చు చూపించారని వారు పేర్కొంటున్నారు. దీనిపై ఎరువుల దుకాణం యజమానిని ప్రశ్నించగా, "ఆర్గనైజర్ చూసుకోవాలి.. నాకు సంబంధం లేదు. ఎరువులు ఇవ్వడం వరకే నా పని" అని చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ వ్యవహారంపై పత్రికల్లో కథనాలు రావడంతో "మమ్మల్ని ఎందుకు మధ్యలోకి లాగుతున్నారు.. వస్తే కూర్చొని మాట్లాడుకుందాం.. గొడవలు వద్దు" అంటూ డీలర్ తమతో మాట్లాడుతున్నారని రైతు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇదిలా ఉండగా, సంబంధిత ఆర్గనైజర్ కూడా రైతు తమ్ముడికి ఫోన్ చేసి "గొడవలు వద్దు.. ఏదైనా ఉంటే పెద్దల సమక్షంలో కూర్చొని మాట్లాడుకుందాం" అని చెప్పినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఈ విషయమై రైతు కుమారుడు ఆర్గనైజర్‌కు ఫోన్ చేసి నారాయణపురంలోని ఎరువుల దుకాణం వద్ద కూర్చొని మాట్లాడుకుందామని కోరగా, అక్కడికి వస్తే తనకు ఏదైనా చేస్తారనే భయంతో తాను రాలేనని ఆర్గనైజర్ చెప్పినట్లు రైతు కుమారుడు ఆరోపించాడు. ఈ విషయాన్ని ఇప్పటికే తన బాబాయికి చెప్పానని, ఆయనతోనే మాట్లాడుకోవాలని చెప్పి ఫోన్ కట్ చేసినట్లు తెలిపాడు. తనకు న్యాయం జరగకపోతే పోలీసులను ఆశ్రయిస్తానని బాధిత రైతు కుటుంబ సభ్యులు స్పష్టం చేస్తున్నారు. 12 ఎకరాలకు సంబంధించిన వ్యవహారంలో భారీగా ఖర్చులు చూపించి తమను మోసం చేసేందుకు ప్రయత్నించారని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత ఆర్గనైజర్, కంపెనీ ఎండీ, ఎరువుల దుకాణం డీలర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తమకు న్యాయం చేయాలని రైతు కుటుంబం కోరుతోంది.

# రూ.33కోట్ల రహదారి పనుల్లో నాణ్యతపై ప్రశ్నలు

**ప్రజాపక్షం/ముదిగొండ:** ముదిగొండతల్లంపాడుతెల్దారిపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులకు సుమారు రూ.33కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా నాణ్యత లేని మట్టిని వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో మట్టితోపాటు పెద్ద రాళ్లను కూడా తరలించి వినియోగిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనంతో చేపడుతున్న పనుల్లో నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు. కాంట్రాక్టర్ పనితీరుతో పాటు అధికారుల పర్యవేక్షణపైనా స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. మట్టి రకం, నాణ్యత, పరిమాణం, రాళ్ల వినియోగంపై సాంకేతికంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. పనుల కొలతలు, నిబంధనలు, బిల్లుల చెల్లింపులపై కూడా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నాణ్యతపై వస్తున్న ఆరోపణలును పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పనులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఘనంగా సామూహిక కుంకుమ పూజలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 10వ డివిజన్ చైతన్య నగర్‌లోని చందమామ అపార్ట్‌మెంట్‌లో వినాయక నవరాత్రోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అపార్టుమెంట్ ప్రాంగణంలో మహిళలు భక్తి శ్రద్ధలతో సామూహిక లలితాదేవి కుంకుమార్చన విశేష పూజలు నిర్వహించారు. గణనాధుని సన్నిధిలో ఏర్పాటు చేసిన ఈ పూజలో అపార్టుమెంటుకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో సాంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొన్నారు. అమ్మవారి అష్టోత్తర శతనామవాళి, లలిత సహస్రనామ పారాయణంతో కుంకుమార్చన జరిపారు. లోక కళ్యాణార్థం, కుటుంబ సౌభాగ్యం ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుతూ పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాద వితరణ గావించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం సరస్వతి పూజ, ఆదివారం అన్నప్రసాద వితరణ, సాయంత్రం దీపోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు.

# హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/మధిరః** మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల మధిరలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.లత ఆధ్వర్యంలో విద్యార్థులకు హెచ్ఐవి/ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి వ్యాప్తికి గల కారణాలు, నివారణ చర్యలు, అపోహలు, తీసుకోవాల్సిన జాగ్రత్త గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్ఐవి సోకిన వారి పట్ల వివక్ష చూపకుండా, వారికి మానవతా దృక్పథంతో అండగా నిలవాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన కలిగి, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్‌కెఆర్ యువసేన ఆధ్వర్యంలో అన్నదానం



**ప్రజాపక్షం/మధిరః** దేశినేనిపాలెం గ్రామంలో ఆర్‌కెఆర్ యువసేన ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు రావూరి శ్రీనివాసరావు, కొట్టారు రాఘవరావు, బిక్కి ప్రసాద్, అబ్బూరి రామన్, దేశినేనిపాలెం సీనియర్ నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, గ్రామ బిఆర్ఎస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ శాఖమూడి కృష్ణారావు తదితరులు కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అన్నదానం చేయడం ఎంతో గొప్ప సేవా కార్యక్రమం అని పేర్కొన్నారు. సమాజంలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజలకు తమవంతు సహకారం అందించాలని ఆకాంక్షించారు. అన్నదాన కార్యక్రమానికి సహకరించిన ఆర్‌కెఆర్ యువసేన సభ్యులకు, కమిటీ సభ్యులకు గ్రామస్థులకు అభినందనలు తెలిపారు.

# ఆటో ఢీ.. వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని బత్తులపల్లి గ్రామానికి చెందిన బొల్లి పోగు గురవయ్య (44) వ్యక్తి గత వారం రోజులు క్రితం అదే గ్రామంలో ఆటో మరియు ద్విచక్ర వాహనం జరిగిన ప్రమాదంలో గాయపడటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ గురవయ్య శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరిత తెలిపారు. భౌతిక దేహాన్ని కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఆయన మృతి పట్ల దళిత కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలోని సర్పంచ్, ప్రజాప్రతినిధులు, పాలకవర్గం, మండల పలువురు, ప్రముఖులు భౌతిక దేహాన్ని సందర్శించి కుటుంబానికి ఓదార్పును, ధైర్యాన్నిచ్చి నివాళులర్పించారు.

# విద్యుత్‌షాక్‌తో రైతు మృతి



**ప్రజాపక్షం/మధిరః** విద్యుద్ఘాతానికి గురై రాయపట్నం గ్రామానికి చెందిన రైతు కూరాకుల అంజన్నబాబు మృతి చెందాడు. వ్యవసాయ భూమిలో పొలానికి నీళ్లు పెడుతున్న సందర్భంలో మోటార్ వద్ద విద్యుత్‌షాక్‌కి గురై మృతి చెందినట్లు సమాచారం. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

# లారీ డ్రైవర్ ఆత్మహత్య



**ప్రజాపక్షం/పెనుబల్లిః** లారీ డ్రైవర్ లారీ క్యాబిన్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పెనుబల్లి మండలంలో చోటుచేసుకుంది. పెనుబల్లి మండలం మండాలపాడు శివారులో జాతీయ రహదారి పక్కన లారీని నిలిపి క్యాబిన్ లో అనుమానాస్పద స్థితిలో ఉరివేసుకుని విగతజీవుడై పడి ఉన్నాడు. వైజాగ్ నుండి నాగర్ కర్నూల్ కి బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ మండాలపాడు శివారులో ఆపి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న సీఐ ముత్తిలింగయ్య, ఎస్సై షేక్ షాకీర్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి మృతుడు ఏపీ, రాష్ట్ర పల్నాడు జిల్లా, తుంబూరు కోట మండలం, కొత్త గంగరాజు పల్లి గ్రామానికి చెందిన వాడపల్లి గంగరాజు (35)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆర్థిక ఇబ్బందులు, లారీ ఫైనాన్స్ సమస్యలతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఈ ఘటనపై సిఐ ముత్తు లింగయ్య ఆధ్వర్యంలో ఎస్సై షాకీర్ విచారణ చేపట్టారు.

# యువత క్రీడలపై దృష్టి సారించాలి

**-సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్కే. సాబీర్ పాషా**
**- ఘనంగా ప్రారంభమైన ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్**




**ప్రజాపక్షం/పాల్వంచ :** యువత, విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సిపిఐ జిల్లాకార్యదర్శి ఎస్కే. సాబీర్ పాషా అన్నారు. శ్యామలా గోపాలన్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వ ర్యంలో ఈ నెల 18 నుండి 22వ, తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వ హిస్తున్న ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్‌ను పాల్వంచ శ్రీనివాసకాలనీలోని మినీ స్టేడియంలో శుక్రవారం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, జిల్లా ఎస్‌పి బిరుదురాజు రోహిత్‌రాజు, కొత్త గూడెం మునిసిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్‌లతో కలిసి బెలూ న్‌లు ఎగురవేసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. ఓటమితో కుంగి పోకుండా నేటి ఓటమిని రేపటి గెలుపు కోసం బాటలు వేసుకోవాలని చెప్పారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా క్రీడలను ఎంచు కోవాలని సూచించారు. ఆటలతో మానసిక ఉల్లాసంతో పాటుగా క్రమ శిక్షణ, శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చదువుతో పాటుగా తమకిష్టమైన క్రీడలపై మక్కువ పెంచుకొని దానిలో రాణించాలన్నారు. ఎందరో విద్యార్థులు ఆటల పోటీలలో మెరుగైన ప్రతిభ కనభరిచి జిల్లా, రాష్ట్ర , జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి ఉద్యోగాలు సాధించి తమ భవి ష్యత్‌ను తీర్చిదిద్దుకొన్నారని వారిని ఆదర్శంగా తీసుకొని క్రీడల్లో రాణిం చాలన్నారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు క్రీడలకు అధిక ప్రాముఖ్యతను ఇస్తున్నారని చెప్పారు. ప్రతిష్టాత్మకమైన ఎర్త్ యూనివర్శి టిలో 50 ఎకరాలలో అంతర్జాతీయ స్థాయిలో క్రీడా మైదానం ఏర్పాటు, పాల్వంచ శ్రీనివాస కాలనీలోని మినీ స్టేడియం అభివృద్ధికి 73 లక్షల నిధులు కేటాయించారని తెలిపారు. ఆయన సహకారంతో క్రీడాభివృ ద్ధికి ఐక్యంగా ముందుకు సాగుదామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు, కొత్తగూడెం మునిసిపల్ వైస్ చైర్మన్ సిరిపురపు లలిత కుమారి, స్పాన్సర్, శ్యామలా గోపాలన్ ఎడ్యు కేషనల్ ఫౌండేషన్ చైర్మన్ నల్లా సురేష్ రెడ్డి, కార్పోరేటర్లు గుర్రం వెంక టేశ్వర్లు, నామా కీర్తి, జిల్లా టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు జి. యుగంధర్‌రెడ్డి, సెక్రటరి జక్కరయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించాలి.. అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించండి

**- ఆసుపత్రిని పరిశీలించిన కలెక్టర్**

**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి సహ కరిస్తామని అందుకు కావలసిన ప్రతిపాదనలు తయారు చేసి పంపించా లని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆసుపత్రి సూపరిండెంట్‌ను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని సంధర్శించారు. అందిస్తున్న వైద్య సేవలను ఆసుపత్రి సూపరిండెంట్ ముక్కంటేశ్వరరావును అడిగి తెలుసుకొన్నారు. ఈ సంధర్భంగా మేయిల్, ఫిమేల్, ఎమరెజన్సీ, క్యాజువాలిటీ తదితర వార్డులు, డయాల సిస్ సెంటర్, బ్లడ్ స్టోరేజి యూనిట్, ఆపరేషన్ థియేటర్, ఐపి విభా గంలో రికార్డులను పరిశీలించారు. జ్వరాలతో బాదపడుతూ ఆసుపత్రికి చేరిన వారి సంఖ్యను అడిగి తెలుసుకొన్నారు. శుక్రవారం జ్వర పీడిత 17మందిని అడ్మిట్ చేసుకొని చికిత్స అందిస్తున్నామని కలెక్టర్‌కు సిబ్బంది తెలిపారు. ఒకే బెడ్‌పై ఇద్దరు రోగులు ఉండటాన్ని గమనించి ఆరా తీశారు. జూలూరుపాడు మండలంలోని డయాలసిస్ రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారని మండల కేంద్రంలోని ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆసుపత్రి ఆవరణంలో ఉన్న ఆ మండలానికి చెందిన వారు కోరారు. పాల్వంచ ఆసుపత్రిలో ప్రస్తుతం 80 బెడ్లు అందుబాటులో ఉన్నాయని మరో 50 బెడ్లు



మంజూరు చేయాలని ఆసుపత్రి సూపరిండెంట్ కలెక్టర్‌ను కోరారు. సుపత్రి భవనంపై మరో అంతస్థు నిర్మాణ చేపట్టాలని కోరారు. దీనికి స్పంధించిన కలెక్టర్ ఇంజనీరింగ్ విభాగాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేస్తే పరిశీలిస్తామని తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించి ప్రభుత్వ వైద్యంపై ప్రజ లకు నమ్మకం పెంచాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం పొందేలా భరోసా కల్పించేలా సేవలను విస్తృతం చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ సోమరాజుదొర, తహాశీల్దార్ దారా ప్రసాద్, సుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు మండలంలో జిల్లా పంచాయతీ అధికారి పర్యటన



**ప్రజాపక్షం/మణుగూరు:** జిల్లా పంచాయతీ అధికారి అనూష శుక్ర వారం మణుగూరు మండలంలోని స్వచ్ఛత హీ సేవా ప్రోగ్రాం లో భాగంగా 3 గ్రామ పంచాయతీలలోని (తోగూడెం, కూనవరం, రామా నుజవరం) ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అవగా హన కల్పించారు. అలాగే ఇంకుడు గుంతల యొక్క ప్రాముఖ్యతను గురించి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలలో చేపడు తున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, అభివృద్ధి పనులు, గ్రామ పంచాయతీ పరిపాలన, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి అధికారులకు, ప్రజాప్రతినిధు లకు తగిన సూచనలు చేశారు. అలాగే రామానుజోరంలోని కొండాయి గూడెం పుష్కర ఘాట్ వినాయక నిమజ్జనం జరుగు స్థలం ను కూడా పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ పర్యటనలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం. శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి పి. వెంకటేశ్వర రావు, సంబంధిత గ్రామ పంచాయతీల సర్పంచులు మడకం కృష్ణ, ఎనిక. శ్వేత, బాడీష కల్పన, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు.

## వారంలోగా యూనిఫాంలు అందించాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడు స్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల విద్యార్థులకు వారం రోజు ల్లోగా యూనిఫామ్‌లు పంపిణీ చేయాలని ఐటిడిఏ పిఓ రాహుల్ హెచ్చ రించారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశపు మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా డిడిల ఏటిడిఓలు, హెచ్ఎంలు, వార్డెన్లులతో ఆయన వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ ఈనెల 25లోగా ప్రతీ విద్యార్థికి యూనిఫాములు ఇవ్వాలని నిర్లక్ష్య వైఖరి వీడకుంటే సహించేది లేదన్నారు. సంబంధిత అధికారులు తప్పని సరిగా పాఠశాలలు వసతి గృహాలను తనిఖీ చేయాలని అన్ని పాఠ్యాంశాలు తప్పని సరిగా బోధించాలన్నారు. వర్షాకాలం నడుస్తు




న్నందున విద్యార్థుల ఆరోగ్యం పరిసరాలపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిడి చందన ఏటిడిఓలు హెచ్ఎంలు వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

## సర్ హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఓటు కోల్పోయిన వారికి జారీ చేసిన నోటీసులపై హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేసి ఈనెల 22లోగా పూర్తి చేయాలని జిల్లా కలక్టర్ అంకిత్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవా రం కొత్తగూడెం తహిశిల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి ఓటర్ల ధృవపత్రా లను పరిశీలించారు. ఏఇఆర్వోలు బిఎల్ఓలు ధృవపత్రాలను పరిశీన ఆన్‌లైన్ ప్రక్రియలో పొరపాట్లు లేకుండా చూడాలని సూచించారు. మొత్తం 9036 నోటీసులకు గానూ సుమారు 6 వేల దరఖాస్తుల ధృవపత్రాలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. అనంతరం పిఎం శ్రీ కూలీలైన్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల విద్యా ప్రావిణ్యాన్ని పరిశీలిం చారు. చక్కటి విద్యాబోదన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. పాల్వంచ ఏరియా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన వార్డులు డయాల్సిస్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం 80 పండకలు అందుబాటులో ఉన్నాయని మరో 50 పడకలు మంజూరు చేయాలని సూపరింటెండెంట్ కలెక్ట ర్‌ను కోరారు. ప్రజలకు నమ్మకం కలిగేలా నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచిం చారు. జూలూరుపాటులో డయాల్సిస్ కేంద్రాన్ని తెరవాలని వచ్చిన విజ్ఞప్తిని పరిశీలిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** మూలకాపాడులో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో దుమ్ముగూడెం మండల సర్పం చుల తరపున ప్రగళ్లపల్లి సర్పంచ్ తుర్రం నవీన్ పలు సమస్యలను టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ కె మాధవరావు దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని సబ్ స్టేషన్లలో సిబ్బంది కొరతను నివారించేందుకు అదనపు సిబ్బం దిని నియమించాలని, సింగిల్ కేబుల్ సమస్యను పరిష్కరించి వీధి దీపాల నిరంతర వెలుగును అరికట్టాలని కోరారు. ఓవర్‌లోడ్ ప్రాంతాల్లో కొత్త డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మార్చాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని చైర్మన్ కె మాధవరావు హామీ ఇచ్చినట్లు తుర్రం నవీన్ తెలిపారు.

## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ఆదిమ తెగలకు ఏజెన్సీ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించా లని డిమాండ్ చేస్తూ ఆదివాసీ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో నంబర్ 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతాల్ల 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. లంబాడాకు సంబంధించిన అంశాలపై హైదరాబాద్‌లో జరుగుతున్న నిరసనలకు సంఘీభా వంగా మండల కేంద్రంలో ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో వేదిక గౌరవ అధ్య క్షుడు కొమురం దామోదర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కుంజా శ్రీనివాస్‌రావు, ఆదివాసీ సంక్షేమ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయంకామరాజు, సర్పంచులు కుర్సం రవి, కల్లూరి ఆదినారాయణ, మహిళా నాయకురాలు బూటారి నాగమణి, నాయకులు అపకా రమేష్, సోందె నరసింహారావు, కొల్లూరి బాజాలు, సోందె చిట్టిబాబు, కొల్లూరి మూగరాజు, కొమరం జంపన్న పాల్గొన్నారు.

## గోవింద్రాలలో ఉచిత పశువైద్య శిబిరం



**ప్రజాపక్షం/కామేపల్లి:** పశువుల్లో సంతానోత్పత్తి సమస్యల నివారణ లక్ష్యంగా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గోవింద్రాలలో శుక్రవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ బానోత్ కమలదేవి, ఉప సర్పంచ్ ఆలోత్ తరశివ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగులు మాట్లాడుతూ పశువులకు సమతుల్య పోషకాహారం అందించాలని, జొన్న, మొక్కజొన్న వంటి మేత పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న గడ్డి విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశువుల కొట్టాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచాలని, ప్రసవానంతరం గర్భసంచి వాపు, ఇన్ఫెక్షన్ వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శిబిరంలో పాడి పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈకార్యక్రమంలో జూనియర్ వైద్యులు, సూపర్‌వైజర్ వెంకటేష్, గోపాలమిత్రులు లక్ష్మయ్య, నాగు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మండల స్థాయి క్రీడలు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని బోదులబండ ఉన్నత పాఠశాల లో జరిగిన మండల స్థాయి క్రీడలు శుక్రవారం ముగిశాయి. పీయంఆర్ ట్రస్టు వారి సహకారంతో మండల స్థాయి క్రీడలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాల లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను బాలుర, బాలికలకు వేర్వేర్ గా నిర్వహించారు. పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. అదే విధంగా ఆటలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బహుమతి ప్రధానోత్సవం లో పలువురు మాట్లాడారు. విద్యార్థులకు పోటీలలో గెలుపు ఓటములు ముఖ్యం కాదన్నారు. క్రీడల వలన స్నేహాభావం పెంపొందిస్తుదన్నారు. వారిలో ఉన్న క్రీడా స్ఫూర్తి వెలుగులోకి వస్తుంద న్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి.రాంప్రసాద్ మండల విదాశాఖాధికారి బాలిన చలప తిరావు,సర్పంచ్ కట్టెకోల నాగార్జున, క్రీడల ఆర్గనైజింగ్ కార్యదర్శి డి.రామకృష్ణ, కన్వీనర్ నిర్మ లకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అనంతు నరేందర్, యూత్ ప్రతినిధి అనంతు నాగేందర్, గుండు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ

**ప్రత్యామ్నాయ పంటలు, సేంద్రియ వ్యవసాయం, పంటల మార్పిడిపై అవగాహన**



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలోని ఖానాపురం రైతువేదికలో ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు రెండు రోజుల జిల్లా పరిధి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయం, ఉద్యాన పటలు, పశుపోషణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. శిక్షణలో ఆర్పియల్ విధానంపై రైతులకు వివరించారు. రైతులు తమ అనువంతో ఇప్పటికే పొందిన వ్యవసాయ నైపుణ్యాలను గుర్తించి వాటికి శాస్త్రీయ పరిజ్ఞానాన్ని జోడించడం ద్వారా మెరుగైన సాగు పద్ధతులను అవలంభించే విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డిడిఎ బి.సరిత మాట్లాడుతూ పంటల ఎంపికలో నైవిద్యాన్ని పాటించాలని సూచించారు. ముఖ్యంగా పప్పు ధాన్యాల సాగును ప్రోత్సహించడంతో పాటు పంటల మార్పిడి విధానాన్ని అవలంభించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. పంటలకు అవసరమైన మేరకే ఎరువులను శాస్త్రీయ సిఫార్సుల ప్రకారం వినియోగించాలని సూచించారు. కెవికె శాస్త్రవేత్త పావని ప్రస్తుత పంటల్లో ఎదురవుతున్న సమస్యలు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేశారు. భూమి పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఎఫ్‌టిఏసి ఏఈ అరుణకుమారి సేంద్రీయ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. నేల ఆరోగ్య పరిరక్షణ, సేంద్రీయ–జీవ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు, రసాయన ఎరువులు, పురుగు మందులను శాస్త్రీయ సిఫార్సుల మేరకు వినియోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ మాట్లాడుతూ వైరా మండలంలో ఎంజిజి385 రకం పెసర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, అవసరమైన రైతులు తమ ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ మట్టూరి వెంకటేశ్వరరావు, ఖానాపురం సర్పంచ్ భూక్యా బాలాజి, వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటనర్సపయ్య, కీర్తి, రాజేష్, యశ్వంత్, షేక్ లాల్‌మహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ మౌలాలి, యన్నం కోటిరెడ్డి, గుడిపూడి రామకృష్ణ, ఏవిఎస్.రెడ్డి, ముత్తినేని రామారావు, షబానా తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిని కరువు జిల్లాగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** భద్రా ద్రి కొత్తగూడెం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శుక్రవారం చుంచుపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కళావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులు, వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది వర్షపాతం తగ్గడంతో పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గిపోయిందని, ఫలితంగా రైతులు అప్పులు, వడ్డీలు చెల్లించలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని, బోరుబావుల కింద సాగు చేస్తున్న రైతులకు 16 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తీవ్ర ఇబ్బందిగా మారుతున్న యాప్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద 200 పని దినాలు కల్పించడంతోపాటు రోజువారీ కూలీని రూ.600కు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలకు తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు కల్తీ వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే ఉమర్, జిల్లా నాయకులు హిడమ్, ఐఎఫ్‌టీయూ కొత్తగూడెం ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు మోత్కూరి మల్లికార్జునరావు, మంకెన వెంకటేశ్వర్లు, ఎన్.సంజీవ్,పీవైఎల్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నరేష్, బత్తుల నాగరాజు, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్తీ రాములమ్మ, జిల్లా నాయకురాళ్లు బి.వెంకటమ్మ, సంధ్య, రాధా, నందిని, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ స్థలాలు ఎన్ని ఉన్నాయి..?

**-లబ్ధిదారులు ఎంత మంది..?**
**-ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన డిప్యూటీ కలెక్టర్ అపూర్వ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ స్థలాలు ఎన్ని ఉన్నాయి. ఎక్కడెక్కడ ఉన్నాయి. ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారని క్షేత్ర స్థాయిలో డిప్యూటీ కలెక్టర్ అపూర్వ పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. ఆదేశాల మేరకు శుక్రవారం పురం, రామచంద్రాపురం గ్రామాలలో పర్యటించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలకు అనువుగా ఉన్నాయా లేదా లని క్షేత్ర స్థాయిలో పరిశీలంచారు. గ్రా మాల వారీగా ఖాళీ స్థలాలు, లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలను రెవిన్యూ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల సంఖ్య ను బట్టి ఇండ్ల స్థలాలు ఇస్తారా.. లేదా ఎన్ని గజాలుఇస్తారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థలం తక్కువగా ఉండి, లబ్ధిదారులు ఎక్కువగా ఉంటే ఎలా నిర్ణయిస్తారని, లబ్ధిదారులను గుర్తించారా లేదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ ఆలస్యం మధుసూధన్ రావు, జీపీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సమస్యలపై కేంద్ర మంత్రికి వినతి



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆయిల్ పామ్ సమస్యలపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో రైతు సంఘం ప్రతినిధులు అలపాటి ప్రసాద్, నల్లమల వెంకటేశ్వరరావు లు వినతి పత్రం సమర్పించారు. దక్షిణాది రాష్ట్రాల రైతాంగ సమస్యలు ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై హైదరాబాద్‌లో జరుగుతున్న వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం సందర్భంగా ఈ వినతి పత్రాన్ని అందజేశారు. ఆయిల్ పామ్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పెరుగుతున్న విస్తీర్ణం తదితర విషయాలను ఆయనకు వినతి పత్రం ద్వారా అందజేశారు.

## విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలి

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** పాఠశాల స్థాయిలో విద్యార్థులకు చదువులతో పాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాచలం లోని గిరిజన గురుకుల జూ.కళాశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 70వ మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. విద్యతో పాటు క్రీడల్లో సైతం రానిస్తే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. పరిస్థితులకు అనుగుణంగా మారి ప్రస్తుత సమాజంలో వస్తున్న నూతన టెక్నాలజీని సమక్రమంగా వినియోగించుకుంటూ మంచి సమాజానికి మనమంతా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ బెక్కంటి శ్రీనివాస్ వెంకటేశ్వర్లు రామచందర్ రాజా శ్రీనివాస్ హేమలత విటి రమణ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మూడు గ్రూపుల మధ్య నలుగుతున్న క్యాడర్

**-దళిత ప్రజాప్రతినిధి విషయంలో దక్కని న్యాయం**

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిథ్యం వహిస్తున్న ఎర్రుపాలెం మండలంలో కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట నడుస్తుంది. మూడు వర్గాల మధ్య క్యాడర్‌తో పాటు ఓ దళిత ప్రజాప్రతినిధి నలుగుతున్నాడు. తన పట్ల అమానవీయంగా సామాజిక వర్గాన్ని ఎత్తిచూపుతూ వ్యవహరించిన వ్యక్తిపై ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోవడం లేదని ఇందుకు గ్రూపులే కారణమన్న వాదన వినిపిస్తుంది. రేమిడిచర్ల సర్పంచ్ కాపు వరప్రసాద్ (స్టాలిన్) ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి లబ్దిదారుని ఆహ్వానం మేరకు ఏప్రిల్ 14న హాజరయ్యారు. అక్కడికి వెళ్లిన సర్పంచ్‌ను గ్రామ కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి శ్రీనుతో పాటు మరికొందరు కులం పేరుతో దూషించారు. ఈ ఘటన జరిగిన రోజే వరప్రసాద్ ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కానీ పోలీసులు ఇంత వరకు ఈ కేసును పట్టించుకోలేదు. దీనితో వరప్రసాద్ మానవ హక్కుల సంఘానికి, ఎస్సి, ఎస్టి కమిషన్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంలో రాజీ చేసేందుకు చేసిన ప్రయత్నం ఫలించ లేదు. కాంగ్రెస్‌లో ఉన్న గ్రూపులే ఇందుకు కారణమన్న ప్రచారం జరుగుతుంది. మొత్తంగా ఈ అంతర్గత విబేధాల కారణంగా ఓ దళిత సర్పంచ్‌కు అన్యాయం జరిగిందన్న భావన వ్యక్తమవుతుంది.

# శ్రీనివాస్ నగర్ బాధితులకు ఊరట

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సిపిఎం పోరాటంతో ఇండ్లు తొలగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. సిపిఎం బాధితుల పక్షాన ఇండ్ల తొలగింపుకు సంబంధించి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. పరస్పర విరుద్ధమైన ఆదేశాలు రాకుండా అసోసియేషన్‌తో పాటు బాధితుల పిటిషన్‌ను కలిపి విచారించాలని కోరినట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై. విక్రం తెలిపారు. దీనిపై ఇండ్లను తొలగించే చర్యలను 15 రోజుల పాటు నిలిపివేసినట్లు తెలిసింది. సిపిఎం ఒక పక్క ప్రజల పక్షాన పోరాటం చేస్తూనే మరో పక్క న్యాయ పోరాటానికి సిద్దమైందని అందులో భాగంగా బాధితులకు ఊరట లభించిందని నున్నా నాగేశ్వరరావు, విక్రమ్ లు తెలిపారు.

# విద్యార్థులకు యూనిఫాం, షూస్ పంపిణీ



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫామ్, షూస్‌ను 7వ వార్డు కౌన్సిలర్ ఫనితి సైదులు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కౌన్సిలర్ ఫణితి సైదులు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులందరికీ ఒకే విధమైన యూనిఫామ్, షూస్ అందించడం సమానత్వ భావనకు చిహ్నమయ్యారు. ఇవి విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి దోహదపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు ఈ ఏడాది నుంచి షూస్‌ను కూడా అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు, నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ధాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పాఠశాలలో అనేక మౌలిక వసతులు సమకూరాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి, ఏఎంసి చైర్మన్ ఆది రజని, ఉపాధ్యాయులు బీరెల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ముళ్లపాటి దంపతుల ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/వైరా:** శ్రీసాయి గజానన ఉత్సవ కమిటీ 22వ వార్షికోత్సవం సందర్భంగా వైరా మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన గణేస్ మండపంలో మున్సిపాలిటీ తొలి వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, 13వ వార్డు కౌన్సిలర్ ముళ్లపాటి విజయలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా ముళ్లపాటి సీతారాములుమ ఆట్లాడుతూ తమ సొంత కమిటీ ఆధ్వర్యంలో గత 22 సంవత్సరాలుగా గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, ఉట్టి వేడుకలు, మహా అన్నదాన కార్యక్రమంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజు సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిటీ సభ్యులంతా అన్నదమ్ముల్లా ఆప్యాయత, అనురాగాలతో కలిసిమెలిసి ఉంటూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఉత్సవాలను విజయవంతం నిర్వహిస్తున్నామని ముళ్లపాటి సీతారాములు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

# చెత్తను వేరు చేస్తే..గ్రామం పరిశుభ్రం



**ప్రజాపక్షం/ముదిగొండ:** గ్రామాల్లో పరిశుభ్రతను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరూ తమ ఇంటి వద్దనే చెత్తను సక్రమంగా వేరు చేయాలని ముదిగొండ గ్రామ పంచాయతీ సర్పంచి కట్టకూరి ఉపేందర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మల్లిక అధ్యక్షతన ఏర్పాటు చేసిన 'స్వచ్ఛతా హీ సేవా2026' అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తూ..గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతీ గృహ యజమాని ఇంటి వద్దనే చెత్తను వేరు చేసి, పంచాయతీ సూచించిన విధంగా నాలుగు రకాల వ్యర్థాలను ఆయా రంగుల డబ్బాల్లో విడివిడిగా వేయాలని తెలిపారు. ఆహార వ్యర్థాలు, కూరగాయలు, పండ్ల తొక్కలు తదితర తడి చెత్తను ఆకుపచ్చ డబ్బాలో, కాగితం, ప్లాస్టిక్, గాజు, లోహాలు వంటి పొడి చెత్తను నీలం డబ్బా, బ్యాటరీలు, బల్బులు, ఇతరత్రా హానికర పదార్థాలను నలుపు డబ్బాలో, శానిటరీకి సంబంధిత వ్యర్థాలు ఎరుపు డబ్బాలో వేరు చేసి వేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ముదిగొండ కళాశాల అమ్మ ఆదర్శ పాఠశాల ఛైర్మన్ రమాదేవి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.